క్లుప్తంగా

శాస్త్రోక్తంగా మహాలయ అమావాస్య పూజలు



అంజయ్య రోడ్డులోని ఆరామ క్షేత్రంలో తిలతర్పణలో పాల్గొన్న బ్రాహ్మణులు

ఒంగోలు మెట్రో: మహాలయ అమావాస్య కావడంతో ఆదివారం ఒంగోలులోని పలు ఆలయాలలో పూజలు చేశారు. స్థానిక మంగమూరు రోడ్డు గాయత్రీ మందిరంలో అమ్మవారి దేవాలయాలలో కాలభైరవ పూజలు నిర్వహించారు. ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక అంజయ్య రోడ్డులోని బ్రాహ్మణ ఆరామ క్షేత్రంలో పురోహితులు అన్నలూరు రామకృష్ణ నేతృత్వంలో సామూహికంగా పాల్గొన్న బ్రాహ్మణ పెద్దలచే తిలతర్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి కార్యవర్గ సభ్యులు సహాయ సహకారాలు అందించారు.

బీఎస్పీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పైనం



జాన్‌బాబు

మద్దిపాడు: మండలంలోని నాగన్నపాలెం గ్రామానికి చెందిన పైనం జాన్‌బాబును బీఎస్పీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతంకుమార్ నియమించారు. ఆదివారం జరిగిన పార్టీ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి నేరెళ్ల రాజు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు పాల్గొని జాన్‌బాబుకు నియామకపత్రాన్ని అందించారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. నాగశిలలు, పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే మార్కాపురం కళాశాల రోడ్డులోని పోలేరమ్మ అమ్మవారికి అర్చకులు అమర్నాథ్ విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బీసీలు రాజకీయ చైతన్యం సాధించాలి



బీసీల సమావేశంలో ఐక్యత తెలియజేస్తున్న నాయకులు

గిద్దలూరు రూరల్: బీసీలు రాజకీయంగా చైతన్యం సాధించాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర నాయకుడు కేశన శంకరరావు పేర్కొన్నారు. గిద్దలూరులోని స్ప్రింగ్ బోర్డు ఆవరణలో ఆదివారం బీసీ సంక్షేమ సంఘ నియామక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలు ఐకమత్యంతో ముందుకు సాగుతూ రాజకీయంగా చైతన్యవంతులు కావాలన్నారు. చట్ట సభల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్, మంత్రిత్వ శాఖ ఏర్పాటు, హక్కులు సాధించుకునేందుకు బీసీలు సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అత్యధిక ఓటు బ్యాంక్ కలిగిన బీసీలను కేవలం ఓట్లు వేయించుకునేందుకు మాత్రమే రాజకీయ పార్టీలు వినియోగించుకుంటున్నాయని, ఈ పరిస్థితిలో మార్పు రావాలన్నారు. బీసీల అభ్యున్నతి కోసం రాజకీయాల్లో బీసీ నాయకులను ప్రోత్సాహించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, డాక్టర్ జేవీ నారాయణ, మహేష్, ఓ.వెంకటయ్యయాదవ్, గిద్దలూరు మండల అధ్యక్షుడు అద్దంకి మధుసూన్ తదితరులు పాల్గొన్నారు.



కేత్రీకే థియేటర్ సమీపంలో అధ్వానంగా ఉన్న ఒంగోలు - కర్నూలు రోడ్డు



ఒంగోలు - సంతనూతలపాడు మధ్య గొయ్యి ఉన్న వంతెన

రహదారి ఇలా.. రాకపోకలు సాగేదెలా..?

చీమకుర్తి రూరల్:

ఒంగోలు – కర్నూలు మెయిన్ రోడ్డు చీమకుర్తిలోని పడమటి బైపాస్ కూడలిలో, కేత్రీకే థియేటర్ సమీపంలో గోతులమయంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా ఆయా ప్రాంతాల్లో రహదారి అత్యంత దారుణంగా తయారవుతోంది. వాహనాలు రాకపోకలు సాగించాలంటే నరకం కనిపిస్తోంది. ఈ రహదారిపై గ్రానైట్ లారీలు, కంటైనర్లు అధిక లోడులతో తిరగడం వలన రహదారి ఛిద్రమైపోయింది. చినుకు పడితే చిత్తడిగా మారడంతో పాటు అడుగడుగునా గుంతలతో నిండిపోయి ప్రయాణికులు, వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. గోతుల్లో రోజుల తరబడి వర్షం నీరు నిలుస్తోంది. లోతు ఎక్కువగా ఉన్న గుంతల్లో పడినప్పుడు వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఒంగోలు – కర్నూలు మెయిన్ రోడ్డుపైనే ఇలాంటి దుస్థితి ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. తక్షణమే స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఒంగోలు – సంతనూతలపాడు మధ్య రోడ్డుపై గొయ్యి

చీమకుర్తి: నిత్యం వేలాది వాహనాలు తిరిగే ఒంగోలు – సంతనూతలపాడు మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై భారీ గొయ్యి పడి పది రోజులైనా సంబంధిత అధికారుల మొద్దునిద్ర వీడకపోవడంపై ప్రయాణికులు, వాహనదారులు నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పది రోజుల క్రితం బ్రిడ్జిపై గొయ్యి పడటంతో పోలీసుల బారికేడ్ పెట్టి గొయ్యి చుట్టూ ఇసుక సంచులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఆదివారం నాటికి ఆ గొయ్యి ఇంకాస్త పెద్దది కావడంతో వంతెన కిందకు కుంగుతుంది. చీమకుర్తి నుంచి ఓవర్‌లోడుతో వచ్చే వాహనాలకు ఈ వంతెన ఇంకాస్త అదురుతూ గొయ్యి సైజు మరికాస్త పెరుగుతోంది. రాత్రివేళల్లో ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్ కళ్లకు రిఫ్లెక్ట్ అవడం కారణంగా పూర్తిగా దగ్గరకు వచ్చేంత వరకూ ఆ గొయ్యితో పాటు అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్, ఇసుక సంచులు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. వంతెన కింద పెద్ద సపోర్టు లేకపోవడంతో గొయ్యి ఇంకాస్త పెద్దదైతే వంతెన కూలే ప్రమాదం కూడా ఉంది. వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతుండగా, అధికారులు, పాలకులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి ఎలాంటి ప్రమాదాలు జరగకముందే ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గొయ్యికి వెంటనే మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గొయ్యి



చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు



నిప్పట్లపాడు చెరువులో మట్టి తవ్విన ప్రదేశం



మట్టి తవ్వడానికి తీసుకొచ్చిన జేసీబీ

చీమకుర్తి రూరల్: విజయవాడ-బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి చీమకుర్తి మండల పరిధిలోని నిప్పట్లపాడు పంచాయతీ పరిధిలోని చెరువు మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్నారని ఆ గ్రామ సర్పంచ్ రావులపల్లి కోటేశ్వరరావు తెలిపారు. గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా వారం రోజుల నుంచి అనధికారికంగా హైవే నిర్మాణ సంస్థ అక్రమ తవ్వకాలు జరుపుతున్నట్లు ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

నేటి నుంచి సెయింట్ థెరిసా చర్చిలో వేడుకలు

ఒంగోలు మెట్రో: స్థానిక సెయింట్ థెరిసా చర్చి నవదిన, మహా జూబ్లీ వేడుకలను ఈ నెల 22 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చర్చి ఫాదర్ డీఎస్ పాల్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను క్రైస్తవ గురువులచే నిర్వహించనున్నట్లు చెప్పారు. దైవ సందేశాలు, దివ్య బలి పూజలు జరుగుతాయన్నారు. నెల్లూరు బిషప్ డాక్టర్ డి.మోజెస్, సహాయక బిషప్ పిల్లి అంటోనీ దాస్ ఆశీసులతో వేడుకలు జరుగుతాయన్నారు. నగరంలోని క్రైస్తవులు వేడుకల్లో పాల్గొని దేవుని ఆశీసులు పొందాలని కోరారు. అక్టోబర్ ఒకటో తేదీ పునీతా చిన్న థెరేసమ్మ పండుగను జయప్రదం చేయాలని ఫాదర్ మణి, చర్చి ఫాదర్ పాల్, సహాయక గురువులు కన్యకా స్త్రీలు, సంఘస్తులు ఆహ్వానించారు.

వర్షంతో రైతులు హర్షం



వరి నాట్లకు సిద్ధంగా ఉన్న నారు

కొత్తపట్నం: నాలుగైదు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ తీవ్రంగా ఉంటున్నప్పటికీ మధ్యాహ్నం తర్వాత మూడునాలుగు గంటల నుంచి భారీ వర్షం పడుతోంది. దీంతో ఇరిగేషన్ చెరువుల్లో నీరు చేరి రైతులు వరి నార్లు పోసుకునేందుకు అనుకూలంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో వరి నారు వేసుకోవడానికి పొలాల్లోనే వర్షం నీరు చేరింది. దీంతో వరి నాట్లు వేయడానికి అన్నదాతలు సిద్ధమవుతున్నారు. కొంత మంది రైతులు వరి విత్తనాలు ఎదపెడుతున్నారు. ఎదపెట్టిన వరి ఈ వర్షానికి కొంత జీవం పోసుకుంది. అల్లూరు మెట్ట భూముల రైతులు వరి విత్తనాలు ఎదపెడుతున్నారు. ఇసుక నేలల్లో భూగర్భ జలాలు పైకి వచ్చి స్ప్రింకర్ మోటార్లకు నీరు సమృద్ధిగా అందుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలకు రొయ్యల చెరువుల్లో కూడా నీటిలో ఉప్పు శాతం తగ్గి రొయ్యలు ఆరోగ్యంగా ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చుండూరి రవిబాబును కలిసిన నవీన్‌కృష్ణారెడ్డి





చుండూరి రవిబాబు, కఠారి శంకరరావును సన్మానిస్తున్న నవీన్‌కృష్ణారెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ అఫీషియల్ స్పోక్స్‌పర్సన్‌గా నియమితులైన కొండూరి నవీన్‌కృష్ణారెడ్డి ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబును ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావును కూడా నవీన్‌కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ ఒంగోలు సోషల్ మీడియా సభ్యులు ఎం.సంధ్యారాణి, వై.చక్రపాణి, టి.రవి, ఎస్.సుబ్బారావు, జి.శ్రీరామ్, సీ పీటర్, మణికంఠ, మారుతి, రంగారెడ్డి, రాజేష్, నియోజకవర్గ వలంటరీ విభాగం అధ్యక్షుడు జనార్దనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం

- విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- భక్తుల దర్శనానికి, పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు
- రోజుకో అలంకరణలో దర్శనమివ్వనున్న అమ్మవార్లు



అలంకరణలో బాలాజీరావుపేటలోని కనకదుర్గమ్మ దేవస్థానం

ఒంగోలు మెట్రో: దసరా ఉత్సవాల సందర్భంగా దేవీ శరన్నవరాత్రులను వైభవంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ రంగుల విద్యుత్ దీపాలంకరణలతో ఆలయాల ప్రాంగణాలను ముస్తాబు చేశారు. నేటి నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు శరన్నవరాత్రులు నిర్వహించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఒంగోలులోని బాలాజీరావుపేటలోని కనకదుర్గమ్మ దేవాలయం, గద్దలగుంట బుర్ర బావి దగ్గర వెలసియున్న మహాకాళి మహాలక్ష్మి మహాసరస్వతి దేవస్థానం, రంగారాయుడు చెరువు వద్ద ఉన్న కంచి కామాక్షమ్మ దేవాలయం, కేశవస్వామిపేటలోని విజయదుర్గ అమ్మవారి ఆలయం, గంటాపాలెంలోని పార్వతమ్మ దేవాలయం, గద్దలగుంటలోని రాజరాజేశ్వరి దేవాలయం, సమతానగర్లోని దుర్గామల్లేశ్వరి దేవాలయం, లాయరుపేట షిర్డీ సాయిబాబా ఆలయంలో ఉపాలయంగా ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో కొలువైయున్న రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోం దగ్గర మహాలక్ష్మి ఆలయం, గద్దలగుంట వేప అంకమ్మ తల్లి దేవస్థానం, గాంధీరోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం, ఏనుగుచెట్టు దగ్గర కాళికా పరమేశ్వరి దేవస్థానాలను దసరా మహోత్సవాల సందర్భంగా వివిధ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. విశేష పూజలతో పాటు భక్తుల సౌకర్యార్థం అమ్మవారి దర్శనానికి ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశాదు. శరన్నవరాత్రుల సందర్భంగా జిల్లావ్యాప్తంగా అమ్మవారి ఆలయాలలో ప్రత్యేక అలంకరణలలో రోజుకో అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.



వివిధ రంగుల విద్యుత్ దీప కాంతులతో గద్దలగుంటలోని రాజరాజేశ్వరి దేవస్థానం



విద్యుత్ దీపాలంకరణలో గంటాపాలెంలోని పార్వతమ్మ దేవస్థానం

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేయాలి

- సీఎం అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం నిర్వహించాలి



హోం మంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు వన్‌టౌన్: ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ఆదివారం హోం మంత్రి అనితకు వినతిపత్రం అందజేశారు. ఒంగోలు వచ్చిన హోం మంత్రిని స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద కలిసి మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా 2021లో ఎస్సీ, ఎస్టీ స్టేట్ లెవల్ విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం నిర్వహించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ సమావేశం నిర్వహించలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పోలీసులు స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి జిల్లాలోనూ ఎస్సీ, ఎస్టీ కేసులను విచారించేందుకు ప్రత్యేకంగా ఇద్దరు డీఎస్పీలను నియమించాలన్నారు. సింగరాయకొండ పోలీసు స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో కామాంధుడైన ఉపాధ్యాయుడిని అరెస్టు చేయాలన్నారు. సింగరాయకొండ ఎస్సై విచారణలో నిందితుడికి అనుకూలంగా కేసును మారుస్తున్నారని హోంమంత్రితో పాటు సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి నీలం ఫిర్యాదు చేశారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.